## దళారులను నమ్మి మోసపోవద్దు

ప్రజాశక్తి-కడప అర్బన్ : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో ఉద్యోగాలు ఇప్పిస్తా మంటూ చెప్పే దళారుల మాటలను నమ్మవద్దని డిఎంహెచ్‌ఒ డాక్టర్ నాగరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత సంవత్సరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నోటిఫికేషన్ సంఖ్య 06/2023 ద్వారా ఒప్పంద ప్రాతిపదికన స్టాఫ్ నర్స్ ఉద్యోగాలు భర్తీ చేయుటకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించి, మెరిట్ లిస్టును Kadapa.ap.gov.inలో అప్లోడ్ చేయడం జరిగింది. లిస్ట్‌లోని పేర్లను ఆధారంగా తీసుకుని అశోక్ కుమార్ అనే వ్యక్తి 9038108948 ఫోన్ నంబర్ ద్వారా ఫోన్లు చేసి, 9951465818 ఫోన్‌పే ద్వారా డబ్బులు తీసుకుని మోసం చేస్తున్నారని అభ్యర్థులు ఫిర్యాదు చేస్తున్నారని పేర్కొన్నారు. పైన తెలిపిన ఫోన్ నంబర్ ద్వారా గానీ, ఏ ఇతర ఫోన్ నంబర్ల నుంచి గానీ ఉద్యోగం ఇప్పిస్తామని దళారులు ఫోన్ చేసిన వెంటనే పోలీస్ వారికి ఫిర్యాదు చేయాలని తెలిపారు. నోటిఫికేషన్ గడువు ముగిసినదని, ఉద్యోగాల కోసం నమ్మి మోసపోకూడదని పేర్కొన్నారు.

# పరిహారం పంపిణీలో జాప్యం వద్దు

**- కలెక్టర్ చెరుకూరి శ్రీధర్**

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-బద్వేలు

పెండింగ్‌లో ఉన్న అన్ని రకాల ఎన్‌హెచ్ నిర్మాణ పనులను, అందుకు సంబంధించి రోడ్డు విస్తరణలో భూములు కోల్పోయిన బాధితులకు త్వరితగతిన పరిహారం పంపిణీ ప్రక్రియ పూర్తయ్యేలా చూడాలని, జాప్యం వద్దని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. గురువారం ఆర్‌డిఒ కార్యాలయంలో డివిజనల్ స్థాయిలో మండలాల తహశీల్దార్లు, ఎన్‌హెచ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బద్వేలు డివిజన్ పరిధిలో బెంగళూరు-విజయవాడ జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా వివిధ ప్రాజెక్టుల్లో ఆయా మండలాల్లో పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, అవార్డుల పంపిణీ, కోర్టులో పెండింగ్ పనులు తదితర అంశాలపై తహశీల్దార్లు, ఎన్‌హెచ్ అధికారులతో సమీక్షించారు. అనంతరం డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలపై రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. డివిజన్ పరిధిలోని తొమ్మిది మండలాల్లో ఇప్పటి వరకు జరిగిన రెవెన్యూ సదస్సుల్లో 3778 ఫిర్యాదులు అందగా 1131 ఫిర్యాదులకు పరిష్కారాలను చూపడం జరిగిందని, రీ సర్వే గ్రామ సభల్లో కూడా ఇప్పటికీ చాలా ఫిర్యాదులకు పరిష్కారాలు అందలేదని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఉదయం 9 గంటలకే ఫీల్డు విజిట్ వెళ్లాలని, సంబంధిత రికార్డులను తమ వెంట తీసుకెళ్లి.. టార్గెట్ నిర్దేశించుకుని త్వరితగతిన పిటిషన్లను పరిష్కరించాలని తహశీల్దార్లకు ఆదేశించారు. డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో రెవెన్యూ సిబ్బంది వివరాలు, వారు నిర్వర్తించే విధుల వివరాలను, క్షేత్ర స్థాయిలో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ చంద్రమోహన్, డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు, నేషనల్ హైవే, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

**వాటర్‌షెడ్లను పరిశీలించిన కలెక్టర్**

**బి.కోడూరు:** మండలంలోని పెదుళ్లపల్లె కొండ ప్రాంతంలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన రాక్ ఫీల్డ్ చెక్‌డ్యామ్, మరో ప్రాంతంలో నిర్మించిన వాటర్ షెడ్స్‌ను కలెక్టర్ శ్రీధర్ పరిశీలించారు. చెక్ డ్యామ్, వాటర్ షెడ్ నిర్మాణంలో ఎలాంటి చర్యలు తీసుకున్నారని, పనుల వివరాలను వాటర్ షెడ్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. చెక్ డ్యాములు, వాటర్ షెడ్ పనుల నిర్మాణాలపై సరైన సమాధానం, వివరాలను తెలుపలేక పోయిన ద్వామా సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పెదుళ్లపల్లె గ్రామాన్ని పరిశీలించి అక్కడి అవసరాలు, సమస్యలు, గ్రామస్తులు, రైతులతో మాట్లాడారు. ఉద్యాన పంటల సాగుకు పెదుళ్లపల్లె గ్రామ పొలాలు అనువుగా ఉన్నాయని ఉద్యాన పంటల సాగువైపు రైతులు అవగాహన పెంచుకోవాలని, గ్రామస్తులు, రైతులకు సలహా ఇచ్చారు. ఉద్యాన పంటల సాగుపై రైతుల్లో చైతన్యం తీసుకురావాలని ద్వామా పీడీని ఆదేశించారు. మండలంలోని మున్నెల్లి, ఇతరపేట గ్రామాల్లో భూ సమస్యలపై రెవెన్యూ, పోలీసు అధికారులతో కలిసి సంబంధిత భూములను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ చంద్రమోహన్, బి.కోడూరు తహశీల్దార్ మధు నాయక్, ద్వామా పిడి ఆదిశేషారెడ్డి, పెదుళ్లపల్లె గ్రామస్తులు, రెవెన్యూ, ద్వామా సిబ్బంది పాల్గొన్నారు.

# మోకాళ్లపై ఇంజనీరింగ్ కార్మికుల నిరసన

మోకాళ్లపై కూర్చుని నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

ప్రజాశక్తి-కడప అర్బన్

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు ఆందోళన బాట పట్టారు. కడప కార్పొరేషన్ వద్ద మోకాళ్లపై చేపట్టిన నిరసన సందర్భంగా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ మాట్లాడుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాలు అమలు కూడా కావడం లేదని తెలిపారు. ఆర్థిక శాఖలో పెండింగ్ వున్నా జిఒలను విడుదల చేసి కార్మికులను ఆదుకోవాలని చెప్పారు. కొత్తగా తీసుకున్న కార్మికులను అవుట్ సోర్సింగ్‌లోకి తీసుకోవాలని, ఆప్కాస్ కార్మికులకు మినిమం టైం స్కేల్ అమలు చెయాలని పేర్కొన్నారు. కార్మికులను పర్మినెంట్ చెయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు చంద్రారెడ్డి, ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్ భాస్కర్, కోశాధికారి గోపి, సహాయ కార్యదర్శి ఆనందరావు, మున్సిపల్ నగర అధ్యక్షులు సుంకర రవి, ఉపాధ్యక్షులు ఇత్తడి ప్రకాష్, డ్రైవర్స్ నాయకులు సుంకర కిరణ్, నారాయణ, ఆంజనేయులు, మహేశ్వరరెడ్డి, శ్రీకాంత్, శ్రీధర్, బుజ్జిబాబు, రమణ, సోమిరెడ్డి బాల గంగయ్య, వీరన్నారాయణ, ఈశ్వర్ రెడ్డి, రామాంజనేయులు, అంజి,రాజ, చాపయ్య, రాంమోహన్ రెడ్డి, శ్రీధర్, మురళీకృష్ణ, సుబ్బయ్య, కార్మికులు పాల్గొన్నారు.

# 'విద్యార్థులు అత్యున్నత స్థాయికి ఎదగాలి'

బహుమతులు పొందిన విద్యార్థులు, పోలీసులతో ఎస్పి అశోక్ కుమార్

ప్రజాశక్తి-కడప అర్బన్

విద్యార్థులు ఉత్తమ చదువులతో అత్యున్నత స్థానాలకు చేరుకోవాలని ఎస్పి ఇ.జి.అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా జిల్లాలోని పోలీస్ సిబ్బందికి, పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు, పోలీసు కుటుంబాల చిన్నారులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో విజేతలగా నిలిచిన వారికి గురువారం పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో నగదు బహుమతులను అందచేశారు. పోలీస్ సిబ్బందికి ప్రస్తుత సమాజంలో పోలీసులు ఎదుర్కొంటున్న సవాళ్లు, పోలీసు కుటుంబాల చిన్నారులు, స్కూల్ విద్యార్థులకు సైబర్ నేరాల నిరోధంలో యువత పాత్ర అనే అంశాలపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి అశోక్‌కుమార్ మాట్లాడుతూ పోలీసు అమరవీరులతో పాటు సమాజంలో పోలీసుల విధులు, త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఏటా అక్టోబర్ 21న పోలీస్ అమరుల స్మారకోత్సవాలను నిర్వహించుకుంటామని తెలిపారు. వ్యాసరచన పోటీలను జిల్లా వ్యాప్తంగా నిర్వహించామని, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పోటీలలో ఎంతో ఉత్సాహంగా పాల్గొని అదుతే ప్రతిభ కనబరచారని విజేతలను అభినందించారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో తరచూ పాల్గొనడం ద్వారా భవిష్యత్తులో సివిల్ సర్వీసెస్, గ్రూప్-1, ఇతర ప్రతిష్టాత్మక పోటీ పరీక్షలలో విజయం సాధించేందుకు ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. సబ్జెక్టుపై పరిజ్ఞానం పెంపొందించుకుని పట్టు సాధించేందుకు దోహదపడతాయన్నారు. విద్యార్థులు మంచి అలవాట్లను పాటిస్తూ చక్కగా చదువుకోవాలని, చదువులతో పాటు మంచి క్రీడలు, చక్కటి హాబీస్ అలవర్చుకోవాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని అత్యున్నత స్థానాలకు చేరుకోవాలని, సమాజంలో నలుగురికి ఆదర్శంగా నిలిచి మంచి గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పి(అడ్మిన్) కె.ప్రకాష్ బాబు, ఎఆర్ అదనపు ఎస్పి బి.రమణయ్య, ఎఆర్ డిఎస్పి శ్రీనివాస రావు, ఆర్ఐలు ఆనంద్, టైటస్, వీరేష్, శ్రీశైలరెడ్డి, డిపిఒ ఎఒ జ్యోతి, సూపరింటెండెంట్ శ్రీనివాసనాయక్, ఆర్ఎస్ఐలు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం : ఎస్పి

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పి, డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరం పాటుపడదామని ఎస్పి అశోక్ కుమార్ పిలుపునిచ్చారు. గురువారం డివైఎఫ్ఐ జిల్లా కమిటీ మాదకద్రవ్యాలపై ముద్రించిన పోస్టర్స్‌ను ఎస్పి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు,మాదకద్రవ్యాల వంటివి జోలికి వెళ్లవద్దని వాటికి దూరంగా వుండాలన్నారు. యువత ఇటువంటి వాటి మోజులో పడి, చెడు వ్యసనాలకు అలవాటుపడి తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారన్నారు. జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల వంటి వాటిని అరికట్టడానికి పోలీసు యంత్రాంగం ఉక్కుపాదం మోపిందని తెలిపారు. యువత చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా, మంచి నడవడికతో డ్రగ్స్ రహిత జిల్లాగా నిర్మిద్దామని పిలుపునిచ్చారు. అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ నాయకత్వాన్ని అభినందించారు. మత్తుపదార్థాల వంటివి వాడిన, అమ్మిన కఠిన శిక్షలు ఉంటాయని చెప్పారు. యువత తమ ఉజ్వల భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని, ఆ మాయలో పడద్దని కోరారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముడియం చిన్ని, వీరణాల శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాహుల్ మాట్లాడుతూ యువతను డ్రగ్స్, మత్తు పదార్థాల నుంచి సన్మార్గం వైపు నడపడం కోసం యువజన సంఘం అవగాహన కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి వంటి వాటికి యువత అలవాటుపడి నిండు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తే ఇటువంటి వాటిపైకి ఆలోచన ఉండదన్నారు. ప్రధానంగా నిరుద్యోగ సమస్యతో యువత వలసలు పోతున్నారని పేర్కొన్నారు. మరికొందరు మొబైల్స్‌లో పబ్జీ వంటికి బానిస అవుతున్నారని తెలిపారు. ఈ మధ్యకాలంలో చదువుకుంటున్న విద్యా సంస్థల కేంద్రాలుగా డ్రగ్స్, గంజాయి వంటివి నడుస్తున్నాయన్నారు. కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ లాంటి భారీ పరిశ్రమ వచ్చి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తే ఈ ప్రాంతం అభివృద్ధితో పాటు యువత చెడు వ్యసనాల వంటివి వైపు వెళ్లకుండా ఉండే అవకాశం ఉంటుందన్నారు. డ్రగ్స్ రహిత సమాజం కోసం అందరం పాటు పడదామని కోరారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ మహిళా జిల్లా కన్వీనర్ గురుదేవి, నగర కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎపిడి నాగరత్నమ్మ

## తప్పు చేస్తే కఠిన చర్యలు తప్పవు : ఎపిడి

ప్రజాశక్తి-కాశినాయన

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో తప్పు చేసిన వారు ఎంతటి వారైనా సరే చట్టపరమైన చర్యలు తప్పవని ఉపాధి హామీ అడిషనల్ పీడీ నాగరత్నమ్మ పేర్కొన్నారు. గత సంవత్సరం నుండి జరిగిన ఉపాధి హామీ పనులపై గత వారం నుండి సామాజిక తనిఖీ నిర్వహించారు. అనంతరం గ్రామాలలో గ్రామసభ నిర్వహించి గురువారం సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మొదటగా ఎస్ఆర్‌పి మండలంలో దాదాపు రూ.9.50 కోట్ల పని జరిగిందని దీనికి సంబంధించిన నివేదికలు టిఆర్‌పిలు చదివి వినిపిస్తారని పేర్కొన్నారు. అనంతరం ప్రతి డిఆర్‌పి అన్ని గ్రామాల సమాచారం చదివి వినిపించారు. తప్పు చేసిన వారిపై అడిషనల్ పీడీ అక్కడికక్కడే తగుచర్యలు తీసుకున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో రికవరీ చేయించారు. మండలంలోని కొన్ని గ్రామ పంచాయతీలో ఫిర్యాదులు చేశారు. మండలంలో మొత్తం 17 పంచాయతీలు ఉండగా ఇంకా కొంత మంది కొన్ని పంచాయతీలు చదివి వినిపించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కార్యక్రమంలో ఎంపిడిఒ మైథిలి, ఎపిఒ ప్రతాప్, సామాజిక తనిఖీ ఎస్ఆర్‌పి, డిఆర్‌పిలు, సామాజితానికి సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

## సచివాలయాన్ని ఫ్రీజోన్ చేయాలి : పిసిసి

ప్రజాశక్తి-కడప

రాష్ట్ర సచివాలయాన్ని ఫ్రీజోన్ చేయాలని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి అన్నారు. గురువారం డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సచివాలయం, అసెంబ్లీ ప్రస్తుతం 3వ జోన్ పరిధిలో ఉన్నాయని తెలిపారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర సచివాలయాన్ని, అసెంబ్లీని, ప్రభుత్వ శాఖల ప్రధాన కార్యాలయాలను, రాష్ట్ర స్థాయి కార్యాలయాలను జోనల్ పరిధి నుండి తొలగించి ఫ్రీజోన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో కూడా ఇదే విధంగా ఫ్రీజోన్‌గా ప్రకటించారన్నారు. ఆదానీ కోసం మోడీ దేశ పరువు ప్రతిష్టలను తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. చట్ట విరుద్ధంగా అమెరికాలో ప్రవేశించిన, నివసిస్తున్న 104 మంది భారతీయులను తిరిగి భారత్‌కు పంపేందుకు అమెరికా అధికారులు వ్యవహరించిన తీరు గర్హనీయం, అమానుషమని పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు సత్తార్, ప్రసాద్ గౌడ్, సుబ్బారెడ్డి, శ్యామల, నాగరత్న పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

## మిద్దెలలో చౌకదుకాణం సీజ్

**ప్రజాశక్తి-కాశినాయన:** మండలంలోని మిద్దెల చౌకదుకాణాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం సీజ్ చేశారు. దుకాణాన్ని అధికారులు ఆకస్మికంగా తనిఖీ చేశామని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దార్ శివశంకర్ తెలిపారు. దుకాణంలో తనిఖీ చేయగా 2,435 కిలోల బియ్యం తేడా ఉన్నాయని చెప్పారు. చౌకదుకాణాన్ని సీజ్ చేసి సంబంధిత విఆర్‌ఒకు అప్పగించమన్నారు.

## జాబ్ మేళాకు స్పందన

**ప్రజాశక్తి-కడప అర్బన్ :** నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాకు విద్యార్థుల నుంచి స్పందన లభించిందని, 4 కంపెనీలు పాల్గొన్నాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవీంద్రనాథ్ తెలిపారు. కడప నోడల్ రిసోర్స్ సెంటర్‌కు సంబంధించిన ఆర్ట్స్ కళాశాల, వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు 74 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. రాత, మౌకిక పరీక్ష నిర్వహించి 34 మంది విద్యార్థులను వివిధ కంపెనీలకు ఎంపిక చేసుకున్నారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపల్, జెకెసి కో-ఆర్డినేటర్ రాము, మెంటార్లు సారథి, సి.వి రవీంద్రారెడ్డి కళాశాల అధ్యాపక బృందం అభినందించారు.

## భూగర్భశాస్త్రం హెడ్ సునీతకు రెండు పేటెంట్లు

**ప్రజాశక్తి-కడప అర్బన్ :** వైవీయూ భూగర్భశాస్త్రం విభాగపు హెడ్ ఆచార్య వంగల సునీతకు రెండు పేటెంట్లు లభించాయి. కృత్రిమ మేధ ఆధారిత మురుగు నీటి శుద్ధి పరికరం, లెడ్ టాక్సిసిటీ డిటెక్షన్ అండ్ క్లీనింగ్ మెషిన్ ఆవిష్కరణలకు యునైటెడ్ కింగ్డమ్ పేటెంట్లు లభించాయి. కృత్రిమ మేధ ఆధారిత మురుగు నీటి శుద్ధి పరికరం వల్ల వ్యర్థ జలములో కలుషితములు పరిమితులను అంచన వేసి దానికి తగ్గట్లుగా యంత్రం పనితీరును ఆప్టిమైజ్ చేసి, తద్వార సమయం, ఖర్చు ఆదా చేసి ఇంధన ఖర్చు తగ్గించి పర్యావరణ పరిరక్షణకు పనిచేస్తుంది. లెడ్ టాక్సిసిటీ డిటెక్షన్ అండ్ క్లీనింగ్ మెషిన్ లీడ్ టాక్సిసిటీ పరిమితిని డిటెక్ట్ చేసి దాని స్థాయిలను తగ్గిస్తుంది. ఈ బృందంలో సునీతతో పాటు ఇతర సభ్యులు బాలాజీ ఇటికల, బండి మురళీధరరెడ్డి, జి.శ్రావ్య సాయి, మన్నల ప్రసాద్ ఇంకా వై. సుదర్శన రెడ్డి ఉన్నారు. ఈ పేటెంట్ రావటం పట్ల విసి కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ పద్మ, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, జియాలజీ విభాగపు ఆచార్యులు రఘుబాబు, జయరాజు హర్షం వ్యక్తం చేశారు.

## 'నారాయణ'పై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-కడప అర్బన్

నారాయణ సంస్థల్లో విద్యార్థుల ఆత్మహత్య పెరిగిపోతున్నాయని, వీటికి ముఖ్యంగా కారణం విద్యా సంస్థల యాజమాన్యమే అని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాహుల్, రవి అన్నారు. గురువారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నారాయణ విద్య సంస్థలపైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నారాయణ విద్యా సంస్థల అధినేత, మంత్రి నారాయణ రాజీనామా చేయాలని పేర్కొన్నారు. యాజమాన్యం ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నారని తెలిపారు. విశాఖపట్నం మధురవాడ బ్రాంచ్లో ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతోన్న చంద్ర వంశీ రాత్రి కాలేజీ బిల్డింగ్ నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు,సరిగ్గా చదవడం లేదని లెక్చరర్ మందలించడంతోనే మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు. ఒడిస్సా రాష్ట్రంలోని రాయపూర్ ప్రాంతం నుంచి ఈ రాష్ట్రానికి వచ్చి చదువుకుంటున్న విద్యార్థి హాస్టల్ పైనుంచి దూకి చనిపోవడం చాలా బాధాకరంగా ఉందని పేర్కొన్నారు. అనంతపురం జిల్లాలో విద్యార్థులు, లెక్చరర్లు అందరూ చూస్తుండగానే నారాయణ కళాశాలలో ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు. కడప జిల్లాలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థి హాస్టల్లో ఉరివేసుకుని చనిపోయాడని, వీటన్నిటికీ నారాయణ విద్యాసంస్థలు యాజమాన్యం ఫీజులు ఒత్తిడే కారణమని పేర్కొన్నారు. విద్యార్థి తల్లిదండ్రులు ప్రాణాలతో కళాశాల పంపిస్తే కళాశాల యజమాన్యం వారి శవాలను ఇంటికి పంపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రుల నుంచి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ ఇంకా మానసిక ఒత్తిడిని విద్యార్థులపై చూపిస్తూ వారి ప్రాణాలు తీస్తున్నారని తెలిపారు. నారాయణ విద్యా సంస్థల అధినేత మంత్రి నారాయణ ను మంత్రి పదవి నుండి తప్పించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడు అభినయ్ పాల్గొన్నారు.

## 16న హ్యాండ్ బాల్ జిల్లా జట్ల ఎంపికలు

**ప్రజాశక్తి - కడప :** ఈ నెల 16వ తేదీన నగరంలోని మున్సిపల్ గ్రౌండ్‌లో సీనియర్ ఉమెన్, జూనియర్ బాయ్స్ హ్యాండ్ బాల్ జిల్లా జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు హ్యాండ్ బాల్ జిల్లా అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి వి.వి.శివప్రసాద్ తెలిపారు. 21 నుండి 23వ తేదీ వరకు కర్నూలులో నిర్వహించే 10వ సీనియర్ ఉమెన్ అండ్ జూనియర్ బాయ్స్ టోర్నమెంట్‌లో పాల్గొనే జిల్లా జట్ల ఎంపి కలను నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా జట్ల ఎంపికలకు హాజ రయ్యే జూనియర్ బాయ్స్ తప్పనిసరిగా జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు తమ వెంట తీసుకురావాలని తెలిపారు. 2005 సంవత్సరం జనవరి నెల 1వ తేదీ తరువాత జన్మించిన వారు జూనియర్ బాయ్స్ జిల్లా జట్టు ఎంపికల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు కోచ్ అబ్దుల్ మునాఫ్ (9502217522), ఆర్గనైజింగ్ సెక్రటరీ శివప్రసాద్ (9985276072) నంబర్లలో సంప్రదించవచ్చునని తెలిపారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న మురళీమోహన్

## ఎఫ్‌డిలపై అధిక వడ్డీ రేట్లు

**- కెనరా బ్యాంక్ రీజినల్ హెడ్ కె.మురళీమోహన్**

ప్రజాశక్తి - కడప

ఫిక్స్‌డ్ డిపాజిట్‌లపై అధిక వడ్డీ రేట్లను ఇస్తామని, మహిళలకు ప్రత్యేకంగా రూపొందించిన ఏంజిల్స్ సేవింగ్స్ అకౌంట్స్ తెరవడం వల్ల కేన్సర్ కేర్ ట్రీట్మెంట్ ఉచితంగా అందిస్తామని కెనరా బ్యాంక్ రీజినల్ హెడ్ కె.మురళీమోహన్ తెలిపారు. గురువారం డోర్ టు డోర్ క్యాంపెయిన్‌లో భాగంగా కెనరా బ్యాంక్ సర్కిల్ ఆఫీస్ నుండి ప్రారంభమైన ర్యాలీని మురళీమోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అన్ని విధాల బెనిఫిట్స్ పొందాలని కోరారు. కార్యక్రమంలో ఎపిఎం ఆర్.కె.రాథోర్, డిఎంలు బి.అరోనా జ్యోతి, పి.గౌరీ శంకర్, కడప రీజినల్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్స్ ఎస్.రమేష్, షఫీక్‌అహ్మద్, విలియంకుమార్, రీజనల్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## అనుమతి తమ పరిధిలో లేదు

**ప్రజాశక్తి-కడప అర్బన్ :** నగరంలోని ఆర్ట్స్ కళాశాలలో ఎంకామ్ లెటరల్ ఎంట్రీ, పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల అనుమతి ఇవ్వడం తమ పరిధిలో లేదని వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ విద్యా విధానం-2020 ప్రకారం 2024-25 విద్యా సంవత్సరానికి పీజీ కోర్సులకు అనుమతి ఇవ్వాల్సింది ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలని తెలిపారు. విశ్వవిద్యాలయ పరిధిలోని డిగ్రీ కళాశాలలో పీజీ కోర్సులకు అనుమతి ఇవ్వాలని వైవీయూ కాలేజ్ డెవలప్మెంట్ కమిటీ, విశ్వవిద్యాలయ ప్రవేశాల సంచాలకుల కార్యాలయ అధికారులు రాష్ట్ర ఉన్నత విద్యా మండలికి దృష్టికి తీసుకువెళ్లి, రెప్రజెంటేషన్ చేశారని పేర్కొన్నారు. ఈ విద్యా సంవత్సరం విశ్వవిద్యాలయం మినహా ఇతర కళాశాలలకు అనుమతులు ఇవ్వడం లేదని స్పష్టం తెలిపారు. అది కూడా ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి పోర్టల్ ద్వారా అప్లై చేసుకోవాలని పేర్కొన్నారు. ఆ తర్వాత వారి అనుమతితో విశ్వవిద్యాలయ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ వెళ్లి కళాశాల వసతులు పరిశీలించి రిపోర్టు ఇచ్చాక అనుమతులు వస్తాయని తెలిపారు. ఇది పూర్తిగా ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి పరిధిలో ఉందని పేర్కొన్నారు.

## ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

ప్రజాశక్తి - కడప

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకోవడానికి అద్భుత వారధి ప్రభుత్వ పురుషుల కళాశాల అని కళాశాల అధ్యాపకులు డాక్టర్ పి.రామకృష్ణ, కెప్టెన్ డాక్టర్ నీలయ్య అన్నారు. గురువారం ప్రభుత్వ పురుషుల కళాశాల అధ్యాపకులు పెండ్లిమర్రిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఆర్ట్స్ కళాశాలలోని కోర్సులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాలలోని భూగర్భ శాస్త్రం జియాలజీ కోర్సు గురించి, దాని ద్వారా విద్యార్థులకు ఉన్న అదుతే అవకాశాలను గూర్చి రామకృష్ణ వివరించారు. వాణిజ్య శాస్త్ర ఆధ్యాపకులు డాక్టర్ నీలయ్య మాట్లాడుతూ కళాశాలలోని బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ పోర్చు గురించి, ఎన్‌సిసి గురించి వివరించారు. ఎన్‌సిసి ద్వారా ఆర్మీ, నేవీ,ఎయిర్ ఫోర్స్‌లతో పాటుగా పోలీస్, రైల్వేలో ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. కార్పొరేట్ కళాశాలకు దీటుగా ప్రభుత్వ కళాశాలను గూర్చి ప్రచారం నిర్వహిస్తున్న ఆధ్యాపకులను పలువురు అభినందించారు.

విద్యార్థులకు కరపత్రాలు అందజేస్తున్న అధ్యాపకులు రామకృష్ణ, నీలయ్య

# రైతుల అభ్యున్నతికే గోకులం షెడ్లు : 'చమర్తి'

గోకులం షెడ్డును ప్రారంభిస్తున్న జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని టిడిపి అన్నమయ్య జిల్లా అధ్యక్షులు చమర్తి జగన్‌మోహన్‌రాజు అన్నారు. గురువారం మండలంలోని చిన్న కొత్తపల్లె గ్రామంలో గోకులం షెడ్లును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో పాడి పరిశ్రమను ప్రోత్సహించేలా టిడిపి ప్రభుత్వం చేపట్టిన గోకులం షెడ్లు పశువుల సంరక్షణకు ఎంతో ప్రయోజనకరంగా ఉందన్నారు. 2018లోనే తెలుగుదేశం ప్రభుత్వం గ్రామాలలో పాడే రైతుల శ్రేయస్సును గుర్తించి గోకులం షెడ్ల నిర్మాణాలకు చర్యలు చేపట్టిందని తెలిపారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం గోకులం షెడ్ల నిర్మాణాల పట్ల నిర్లక్ష్య ధోరణిగా వ్యవహరించి పశుపోషకుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గోకులం షెడ్ల నిర్మాణాలకు చర్యలు చేపట్టిందని చెప్పారు. గ్రామాలలో పశుపోషణ, గొర్రెలు,మేకల పెంపకానికి పాడి పరిశ్రమకు ఎంతగానో దోహదపడేలా మెరుగైన వసతితో మినీ గోకులం పేరిట షెడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కొమర వెంకట నరసయ్య, మాజీ ఎంపిటిసి ఓబినేని సుబ్బమ్మ, ఒంటిమిట్ట మాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణ నాయుడు, మాజీ జడ్‌పిటిసి చలమయ్య యాదవ్, న్యాయవాదులు న్యాయవాది ఆదినారాయణ రావు, రామదాసు, నాయకులు మామిళ్ల ఈశ్వరయ్య, మామిళ్ల శ్రీహరి, దత్తాత్రేయులు, శివకుమార్, సర్పంచ్ ప్రతాప్ నాయుడు, మాజీ స్కూల్ కమిటీ చైర్మన్ కొండయ్య, స్కూల్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీను పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ట్రైనీ డిఎస్‌పి భవాని

## ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల**

వాహనాలు నడిపేవారు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని ట్రైనీ డిఎస్‌పి భవాని సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహిస్తున్నట్లు డిఎస్‌పి భవాని, సిఐ నరేష్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెరుగుతున్న రోడ్డు ప్రమాదాల దృష్ట్యా ప్రతి ఒక్కరూ బాధ్యతగా నడుచుకోవాలన్నారు. మద్యపానం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ఫోర్ వీలర్ డ్రైవర్లు తప్పక సీటు బెల్టు పెట్టుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. లైసెన్స్ లేనివారు వాహనాలు నడపరాదని సూచించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పశుగ్రాసం దగ్ధం : రూ.30 వేలు నష్టం

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

స్థానిక పాత బస్టాండ్ కూడలిలో బిషప్ వస్తున్న సందర్భంగా టపాసులు పేల్చడంతో వాటి నిప్పు రవ్వలు ఎగిరి ట్రాక్టర్ ట్రాలీలో పడడంతో అందులో ఉన్న సొప్ప దగ్ధమైంది. నిప్పురవ్వలు పడి ట్రాలీలో మంటలు చెలరేగాయి. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి అదే దారిలో ఉన్న ఫైర్‌స్టేషన్ వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఫైర్‌స్టేషన్ అధికారి సత్యంరెడ్డి మాట్లాడుతూ జమ్మలమడుగు మండల పరిధిలోని ఎస్.ఉప్పలపాడు గ్రామం నుంచి ముద్దనూరు మండలంలోని గంగాదేవి పల్లెకు చెందిన రైతు వెన్నపూస కుల్లాయిరెడ్డి పశువుల కోసం గ్రాసం కొనుగోలు చేసి ట్రాక్టర్‌పై తీసుకొని వెళుతుండగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. వెళుతున్న ట్రాక్టర్ ట్రాలీ ఒక్కసారిగా మంటలు చెలరేగాయన్నారు. రైతుకు రూ.30వేలు నష్టం వాటిల్లిందని తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి, విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

**రెండు బోద కొట్టాలూ..**

**ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్ ) :** మండలంలోని శంకరాపురం గ్రామంలో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో గ్రామంలోని రెండు బోద కొట్టాలు దగ్ధమయ్యాయి. సంఘటన ఎలా జరిగిందోనని స్థానిక చర్చించుకుంటున్నారు.

శ్రీనివాసులుకు చెందిన రెండు బోద కొట్టాలు కాలిపోయాయి. దాదాపు రూ.4లక్షలు నష్టం సంభవించినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో ఇంట్లోని సామానులు, చేనేత మగ్గాలు, బీరువాలు అగ్నిప్రమాదానికి గురయ్యాయని ఫైర్ అధికారులు తెలిపారు. ప్రమాద సమయంలో కుటుంబ సభ్యులందరూ ఇళ్లకు బీగాలు వేసుకొని పొలం పనులకు వెళ్లారు.

## ఆస్తులను కాపాడుతూ..అభివృద్ధే లక్ష్యం

**- బిషప్ వరప్రసాద్**

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

రాయలసీమ వ్యాప్తంగా సిఎస్ఐ ఆస్తులను కాపాడుతూ వాటిని అభివృద్ధి చేయడమే లక్ష్యంగా రాయలసీమ అధ్యక్ష మండలి పనిచేస్తుందని బిషప్ వరప్రసాద్ తెలిపారు. స్థానిక బిషప్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నాలుగేళ్లుగా రాయలసీమ అధ్యక్ష మండలానికి బిషప్‌గా ఉన్నానన్నారు. రాయలసీమ ప్రాంతంలోని ఏడు జిల్లాల్లో సిఎస్ఐ ఆస్తులు ఉన్నాయన్నారు. జమ్మలమడుగులో క్యాంబెల్ ఆసుపత్రి, చర్చిలు, విద్య, వైద్య సంస్థలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించే సంస్థలు ఉన్నాయన్నారు. వీటిని పరిరక్షించేందుకు స్థానికంగా ఉన్న వైకే కిరణ్, డాక్టర్ పి రవీంద్రను నియమించామన్నారు. ఈ ఆస్తులన్నీ వీరి సంరక్షణలో ఉంటాయన్నారు. రోడ్డుకు సమీపంలో, కమర్షియల్ సెంటర్లలో ఉన్న స్థలాల్లో షాపింగ్ రూములను, కాంప్లెక్స్‌ల నిర్మాణాలకు ప్రణాళిక చేస్తున్నామన్నారు. అందుకు స్థానిక అధికారులు, నాయకులు, ప్రజలు సహకరించాలని కోరారు. విదేశాల నుండి ఎలాంటి నిధులు రావని, ఆస్తులనే ఆదాయ వనరులుగా మార్చుకొని కానుకలను స్వీకరించి ముందుకు వెళుతున్నామన్నారు. కార్యక్రమంలో రాయలసీమ సిఎస్ఐ డయాలసిస్ సెక్రటరీ సాల్మన్ బాబు, జమ్మలమడుగు సిఎస్ఐ ఆస్తుల పరిరక్షణ కర్త వైకే కిరణ్ పాల్గొన్నారు.

## బిల్లులు చెల్లించి.. రోడ్డు పనులు ప్రారంభించండి

**ప్రజాశక్తి - చక్రాయపేట**

రాయచోటి- వేంపల్లి జాతీయ రహదారి రోడ్డు పనులు 2022లో దాదాపు రూ.238 కోట్లతో ఎస్ఆర్‌కె కంపెనీ దక్కించుకుని, ఆ పనులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఎస్ఆర్‌కె కంపెనీ యజమాని రవికుమార్‌రెడ్డి అకస్మాత్తుగా చనిపోవడంతో సునీల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ ఆ రోడ్డు పనులు చేశారు. వీరికి దాదాపు రూ. కోటి 75 లక్షలు బిల్లు రావాల్సి ఉంది. దీంతోపాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కూలీలకు, టిప్పర్లు, జెసిబిలు, పెట్రోల్ బంక్ ఓనర్లకు, కిరాణా షాపు వారికి దాదాపు రూ.కోటి 50 లక్షలు ఇవ్వవలసి ఉంది. ఈ పరిస్థితుల్లో మళ్లీ ఎస్ఆర్‌కె జివిఎస్‌సి పిడిఆర్ అండ్ మోడ్రన్ కన్స్ట్రక్షన్స్ పనులు చేయడంతోపాటు గతంలో చేసిన పనులకు ఈ కంపెనీ బిల్లులు చేసుకోవాలనే ప్రయత్నం చేసింది. ఈ నేపథ్యంలో గురువారం గండి క్షేత్రంలో గతంలో పనిచేసిన కంపెనీ సునీల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ యజమాని సుందరం, పనిచేసిన బాధితులు విలేకరులతో మాట్లాడుతూ తమకు రావాల్సిన మొత్తం చెల్లించిన తర్వాతే రోడ్డు పనులు చేసుకోవాలన్నారు. రాయచోటి- వేంపల్లి పనులు తిరిగి కొనసాగించాలంటే కంపెనీకి బాధితులకు రావాల్సిన మొత్తాన్ని చెల్లించాల్సిందేనని తెలిపారు. అంతరకు పనులు చేయనీయబోమని, అవసరమైతే ఆందోళనలు చేపడుతామని వారు హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో సునీల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ యజమాని సుందరం, రాష్ట్ర నాయకుడు కె.రామచంద్రారెడ్డి, దశరథ, బాధితులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణం ఏర్పాటుపై అభ్యంతరం

**ప్రజాశక్తి - ఖాజీపేట**

మండల పరిధిలోని కోటం గురువాయపల్లెలో కల్లుగీత కార్మికుల కోట కింద నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణం ప్రారంభించడంపై గురువారం స్థానిక మహిళలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధాన రహదారిపై, జనావాసాల మధ్యన, ఆలయానికి సమీపంలో మద్యం దుకాణం ఏర్పాటు చేశారంటూ అభ్యంతరం తెలిపారు. విషయం తెలుసుకున్న అధికారులు సంఘటన ప్రాంతానికి వెళ్లి మహిళలకు నచ్చజెప్పాడు. ప్రభుత్వ నిబంధనల మేరకే దుకాణం ఏర్పాటు చేశారని, ఏమైనా సమస్య ఉంటే రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు చేపడతామని అధికారులు తెలపడం.. దుకాణ యజమానులు కూడా హామీ ఇవ్వడంతో మహిళలు శాంతించారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి

**ప్రజాశక్తి - ఖాజీపేట**

మండల పరిధిలోని భూమాయపల్లె వద్ద కడప-కర్నూలు జాతీయ రహదారిపై గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో అరుణమ్మ (58) అనే మహిళ మృతి చెందింది. అరుణమ్మ రోడ్డు దాటుతుండగా ఓ ద్విచక్ర వాహనదారుడు ఢీకొంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలియాల్సి ఉంది.

# అసంపూర్తిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణం

### ల్యాబ్ సౌకర్యం అంతంత మాత్రమే.. రెగ్యులర్ అధ్యాపకులు లేక విద్యార్థుల అవస్థలు - అధికారులు స్పందించాలని విన్నపం

**ప్రజాశక్తి - వేంపల్లె**

పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్య దూరం కాకూడదనే ఉద్దేశంతో గత వైసిపి ప్రభుత్వం వేంపల్లెలోని గండి రోడ్డులో 2020-21 ఏడాదిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేశారు. బీఎస్సీ, బీఏ, బీకాం గ్రూపులను ఏర్పాటు చేసి ఆంగ్ల మాధ్యమంలో బోధిస్తున్నారు. పక్కా భవనాలు నిర్మించేందుకు కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అప్పటి సిఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన అప్పటి సిఎం జగన్ వెంటనే కళాశాల భవనాలు నిర్మించేందుకు నిధులు కేటా యించారు. గండి రోడ్డులోని వైఎస్ రాజారెడ్డి నగర్ గుట్టపైన 15ఎకరాల సువిశాలమైన ప్రదేశంలో ప్రశాంత వాతావరణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఉండాలనే ఉద్దేశంతో రూ.20కోట్లతో నూతన తరగతి భవ నాలు, ల్యాబ్ , ప్రహరీ, రూ.10కోట్లతో ఇంటర్నల్ రోడ్లు, ఆడిటోరియం అత్యాధునిక డిజైన్లతో నిర్మించేందుకు రూపొందించారు. తాజాగా పలుచోట్ల నిర్మాణంలో ఉన్న కళాశాల భవనాలను పూర్తి చేయాలనే చిత్తశుద్ధే కూటమి నేతలకు లేకుండా పోయింది. వేంపల్లెలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనాలు పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత చేసిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రా క్టర్లు పనులను వదిలేశారు. నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. విద్యా రంగంలోని సమస్యలపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహ రిస్తోందనడానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల పనులే నిదర్శనం. గత వైసిపి ప్రభుత్వం నిధులు మంజూరు చేయ డంతో 55 శాతం నిర్మాణ పనులు పూర్త య్యాయి. ఆ తర్వాత ఎన్నికలు రావడం.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆపనులు అటకెక్కాయి. సదరు కాంట్రాక్టర్లకు రూ.2.40కోట్లు బిల్లులు బకాయిలు పెండింగ్ పడ్డాయి. ప్రస్తుతం వేంపల్లెలోని పాత జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల భవనాల్లో డిగ్రీ కళాశాలను నిర్వహిస్తున్నారు. అరకొర ల్యాబ్ సౌకర్యాలు, మౌలిక వసతులు సరిగా లేక ఇబ్బందుల మధ్య విద్యాభ్యాసం సాగుతోంది. ఇక్కడ శాశ్విత ప్రాతిపదికన సిబ్బంది నియామకాలు కూడా జరగలేదు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 80 శాతం విద్యార్థినులు ఉండడంతో ప్రధానమంత్రి ఉచ్చతర్ శిక్షా అభియాన్ కింద కళాశాల ఎంపికైంది. అందుకు డీపీఆర్ పంపాలని కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు సైతం వచ్చాయి. పైగా వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల కార్పొరేట్ కళాశాలలో ధీటుగా పోటీ పడుతోంది. 2020-21 విద్యా సంవత్సరంలో 75 శాతం, 2021-22లో 80.6, 2022-23 82.60, 2029-24 89 శాతం ఫలితాలు వచ్చాయి. ఇంకా మెరుగైన వసతులు, శాశ్విత ప్రాతిపదికన అధ్యాపకులను నియమిస్తే వంద శాతం ఫలితాలను సాధించేందుకు అవకాశం ఉంది. రెండేళ్లుగా నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనే లక్ష్యంగా డిగ్రీ కళాశాల దినదినాభివృద్ధి చెందుతోంది. 2021లో 13 మంది విద్యార్థులు, 2022లో 69 మంది విద్యార్థులు తను నైపుణ్యతను సాధించి పెద్దపెద్ద కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. ప్లేస్‌మెంట్ అధికారి టివి అరవింద్ ఆధ్వర్యంలో దాదాపు 300 మంది విద్యార్థులకుపైగా ఉద్యోగాలతోపాటు ఉన్నత చదువులు అభ్యసిస్తున్నారు. ల్యాబ్‌లు పెట్టుకోవడానికి వసతులు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళా శాలలో 16 మంది రెగ్యులర్ ఉద్యోగులు ఉండగా, 6మంది కాంట్రాక్టు ఉద్యో గులు, 9 మంది గెస్ట్ ఫ్యాకల్టీలు పని చేస్తున్నారు. అసంపూర్తిగా నిలిచిన డిగ్రీ కళాశాల భవనాల నిర్మాణం కోసం జిల్లా ఉన్నతాధికారులు, కూటమి నేతలు చర్యలు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

**కనీస వసతుల్లేక ఇబ్బందులు**

ప్రస్తుతం ఉన్న అధ్యాపకులు నాణ్యమైన బోధన అందిస్తున్నారు. మంచి ఫలితాలను సాధిస్తున్నాం. సరైన మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నాం.

**- బాబు, విద్యార్థి, వేంపల్లె**

**బాలికలకు హాస్టల్ వసతి కల్పించాలి**

డిగ్రీ కళాశాలలో 80 శాతం మహిళలు ఉన్నందున హాస్టల్ వసతి ఏర్పాటు చేస్తే బాగుంటుంది. కొత్తగా నిర్మిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనాల్లో హాస్టల్‌ను ఏర్పాటు చేయాలి. ఆటస్థలం, జిమ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలి.

**-నందిని, విద్యార్థిని, వేంపల్లె**

**నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి**

అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల తరగతి భవనాలు త్వరగా పూర్తి చేయాలి. అరకొరగా ల్యాబ్ సౌకర్యం ఉన్నందున విద్యార్థులు ఇబ్బం దులు పడుతున్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న అధ్యాపకులతో ఉత్తమ బోధన అందిస్తున్నాం. త్వరలోనే సమస్యలు పరిష్కారమవుతాయని ఆశిస్తున్నాం.

**- డాక్టర్ యోగాంజనేయులు, ప్రిన్సిపల్**

# పైసలిస్తేనే ఉంటాం.. వైసిపి కౌన్సిలర్ల డిమాండ్

### అధినాయకత్వంలో చర్చ - ఇక ఒక్కరిని కూడా చేజార్చుకోకూడదని నిర్ణయం

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

మూడు రోజుల నుంచి పులివెందుల రాజకీయాలు హీటెక్కాయి. ఇప్పటికూ వైసిపి కౌన్సిలర్లు ఇద్దరు టిడిపిలో చేరారు. వారితో పాటు కార్యకర్తలు కూడా టిడిపిలో చేరారు. ఈ నేపథ్యంలో పులివెందులలో రాజకీయ సెగ మొదలైంది. పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బీటెక్ రవి రాజకీయంగా దూకుడు పెంచారు. 30వ వార్డు కౌన్సిలర్ షాహీదా, 13వ వార్డు కౌన్సిలర్ రంగనాయకులు టిడిపి తీర్థం పుచ్చుకున్న విషయం తెలిసిందే. మరికొంతమంది టచ్‌లో ఉన్నారని, త్వరలో వైసిపి ఖాళీ అవుతుందని బీటెక్ రవి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఈ పరిస్థితుల్లో వైసిపి నాయకులు మిగిలిన కౌన్సిలర్లతో విడివిడిగా మాట్లాడినట్లు సమాచారం. తమకు పైసలిస్తేనే పార్టీలో ఉంటాం.. లేకపోతే మారుతాం అని కొందరు కౌన్సిలర్లు తెగేసి చెప్పినట్లు తెలుస్తోంది. కరోనా సమయంలో నిత్యావసర సరుకుల పంపిణీకి తమ నుంచి ఒకొక్కరి వద్ద రూ.లక్ష వసూలు చేసి ఆ వార్డులో సరుకులు సరఫరా చేశారని, ప్రమాణ స్వీకారానికి మరో రూ.50 వేలు తీసుకున్నారని కౌన్సిలర్లు నాయకులను ప్రశ్నించినట్లు తెలుస్తోంది. కొంతమంది కౌన్సిలర్లకు మాత్రమే వైసిపి అధికారంలో పనులు ఇచ్చారని, వారిలో కొంతమందికి బిల్లులు రాలేదన్నట్లు సమాచారం. కౌన్సిలర్‌గా ఉండి అప్పులు చేయాల్సి వచ్చిందని, అవి కడితేనే పార్టీలో ఉంటామని చెప్పినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనిపై వైసిపి ముఖ్య నేతలు చర్చించుకున్నట్లు సమాచారం. వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనకు ఈనెల 14న వస్తున్న సందర్భంగా ఈ విషయాలు ఆయన దృష్టికి తీసుకువెళ్లి ఇక ఒక్కరిని కూడా చేజారకుండా చూడాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కౌన్సిలర్లు పెట్టిన డిమాండ్లు వైసిపి అధిష్టానం అంగీకంచకపోతే మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని చేజార్చుకునే పరిస్థితి కూడా లేకపోలేదు. ప్రత్యేక సమావేశం వాళ్లతో ఏర్పాటు చేసేలా జగన్ చూస్తున్నట్లు సమాచారం. ఎట్టి పరిస్థితుల్లోనూ మెజార్టీ కౌన్సిలర్లు పార్టీలో కొనసాగేలా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి అన్ని రకాల హామీలు ఇస్తున్నారు. అయితే టిడిపి పులివెందులలో ఇప్పటికే రెండు వర్గాలుగా కొట్టుకుంటున్నారు. మనం అక్కడికి వెళ్లి ఏం సాధిస్తామని కొంతమంది నిర్ణయించుకున్నట్లు సమాచారం. పులివెందుల రాజకీయం ఎలా మారుతుందో వేచి చూడాల్సిందే.

# టిడిపివి అనైతిక రాజకీయాలు

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

స్వార్థ రాజకీయాలు చేయడం టిడిపి నాయకులకు తగదని వైసిపి కౌన్సిలర్లు పేర్కొన్నారు. స్థానిక వైఎస్ మనోహర్‌రెడ్డి నివాసంలో గురువారం వారు మాట్లాడుతూ పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని ఇద్దరు వైసిపి కౌన్సిలర్లు కేవలం తమ స్వార్థం కోసమే పార్టీని వీడారని తెలిపారు. పులివెందులలో టిడిపి నాయకుల నీచ రాజకీయాలు మరోసారి బయటపడ్డాయన్నారు. టిడిపి నాయకులు కేవలం తమ రాజకీయ ఉనికి కోసం డబ్బులతో, ఇతర ప్రలోభాలకు గురిచేసి వైసిపి కౌన్సిలర్లను సంతలో పశువుల మాదిరి కొన్నారని ఆరోపించారు. వైఎస్ఆర్ కుటుంబం తమపై ఎంతో నమ్మకంతో వైసిపి తరపున కౌన్సిలర్లుగా అవకాశం ఇచ్చిందన్నారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తమ పట్ల ఎంతో గౌరవంగా పార్టీలో స్థానం ఇచ్చారన్నారు. పట్టణంలో, వార్డుల్లో ఏమైనా సమస్యలుంటే చైర్మెన్ వరప్రసాద్, వైఎస్ మనోహర్‌రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి దృష్టికి తీసుకువెళితే ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరిస్తున్నారని తెలిపారు. అధికార పార్టీ నాయకులు పులివెందులలో ఆగిపోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయడంలో శ్రద్ధ పెట్టాలన్నారు. అధికారంలో ఉన్నందున నిధులు తెచ్చి పులివెందులలో అభివృద్ధి చేస్తే ప్రజలు హర్షిస్తారన్నారు. అలాకాకుండా వారు అనైతికంగా సంపాదించిన డబ్బుతో ఇలా కౌన్సిలర్లను కొనుగోలు చేయడం పట్ల ప్రజలు అసహ్యించుకుంటున్నారని తెలిపారు. అధికార పార్టీ నాయకులు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా తామంతా చివరి వరకు వైఎస్ కుటుంబం వెంటే ఉంటామని కౌన్సిలర్లు పేర్కొన్నారు. సమావేశంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ హఫీజ్, కౌన్సిలర్ పార్నపల్లి కిషోర్, ఖాదర్ బాషా, రాజశేఖర్, విజయ్‌కుమార్ నాయుడు మహిళా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వైసిపి కౌన్సిలర్లు

## అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి

**ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్**

పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 2019 నుండి అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని సిఐటియు నాయకుడు జి.ఏసుదాసు డిమాండ్ చేశారు. ఆ మేరకు గురువారం స్థానిక ఐసిడిఎస్ అధికారికి వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ సమస్యల పరిష్కారానికి 42 రోజులపాటు చారిత్రాత్మక సమ్మె నిర్వహించామన్నారు. సమ్మె ముగింపు సందర్భంగా అంగన్వాడీలకు 2024 జూలైలో వేతనాలు పెంచుతాం, ఇతర సమస్యలు పరిష్కారం చేస్తానని మినిట్స్ ఇచ్చారు.. అయినా నేటి వరకు ఆ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం ఈ నెల 17న ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్నామన్నారు. అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలన్నారు. గ్రాట్యూటీ అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న మొత్తం మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్పు చేస్తూ వెంటనే జిఒ ఇవ్వాలన్నారు. హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్‌లైన్స్ రూపొందించి అమలు చేయాలన్నారు. సంక్షేమ పథకాలు అంగన్వాడీలకు వర్తింపజేయాలన్నారు. సాధికారత సర్వేలో ప్రభుత్వ ఉద్యోగులు అనే పదాన్ని తొలిగించాలన్నారు. సర్వీసులో ఉండి చనిపోయిన వారికి దహన సంస్కార ఖర్చులకు రూ.20 వేలు, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. సమ్మెకాలంలో చనిపోయిన వారికి కూడా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మీదేవి, మోరగుడి సరోజ పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

## అబార్షన్లు చేస్తే కఠిన చర్యలు

**ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :** అబార్షన్ చేస్తే కఠిన చర్యలు తప్పవని ఉప జిల్లా వైద్య, ఆరోగ్య శాఖా ధికారి డాక్టర్ శివ ప్రసాద్ రెడ్డి, గైన కాలజిస్ట్ డాక్టర్ కావ్య హెచ్చరించారు. జమ్మలమడుగు డివి జన్ పరిధిలోని పిపి యూనిట్ జిల్లా ఆసుపత్రిలో గురువారం వివిధ ప్రాథ మిక ఆరోగ్య కేంద్రాల్లో జరిగిన అబా ర్షన్‌లపై వారు ఆడిట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ డివిజన్ పరిధిలో అవసరం లేకున్నా అబార్షన్‌లు చేయించుకొంటున్నారని, ఇందుకు కారణం ఆడపిల్ల పుడుతుందని, మొదటి లేదా రెండవ కాన్పులో ఆడపిల్లలు పుట్టినవారు ఈ అబార్షన్ చేయించుకొంటున్నారని తెలిపారు. ఆడిట్ చేసి ఎక్కడ అబార్షన్‌లు చేయుంచుకొంటున్నారో విచారించి సంబంధిందించిన ప్రయివేట్ ఆసుపత్రులపై చట్ట పరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్లు, ఎఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

## నీటిని పొదుపుగా వాడుకోవాలి

**ప్రజాశక్తి - లింగాల**

వేసవి కాలంలో అడుగంటుతున్న భూగర్భ జలాలను కాపాడుకునేందుకు నీటిని పొదుపుగా వాడుకోవాలని టిడిపి మండల ఇన్‌ఛార్జి దేవిరెడ్డి సంజీవరెడ్డి సూచించారు. మండల పరిధిలోని పెద్దకుడాల గ్రామ సచివాలయంలో గురువారం వాటర్ షెడ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి సంరక్షణతోనే సమగ్రాభివృద్ధి జరుగుతుందన్నారు. నీటి వనరులను కాపాడుకోవాలన్నారు. రైతులు ముందుకు వచ్చి అధికారులతో సమన్వయం చేసుకొని నిధులను వినియోగించుకోవాన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, ఉపాధి హామీ ఎపిఒ గంగరాజు, టిడిపి రైతు విభాగ జిల్లా కార్యదర్శి పెద్దమల్లు చిన్న అంకిరెడ్డి పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలు అందజేస్తున్న సంజీవరెడ్డి

## మహిళలకు సరోజినీ నాయుడు ఆదర్శం

**ప్రజాశక్తి - వేంపల్లె**

భారత స్వాతంత్ర సమరయోధురాలు, మొట్టమొదటి మహిళా గవర్నర్ సరోజినీ నాయుడు మహిళా లోకానికి ఆదర్శనీయమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ సతీష్ తెలిపారు. స్థానిక వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ కో-ఆర్డినేటర్ డాక్టర్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. సరోజినీ నాయుడు చిత్ర పటానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా రంగాల్లో మహిళలు కూడా నైపుణ్యం సాధించి గుర్తింపు పొందుతున్నట్లు చెప్పారు. మహిళలు రాణిస్తున్నారంటే అందుకు కారణం ఝాన్సీ లక్ష్మీబాయి, సావిత్రిబాయి పూలే, సరోజినీ నాయుడు వంటి మహిళాలలే ఆదర్శమని పేర్కొన్నారు. సరోజినీ నాయుడు రచించిన గ్రంథాల్లో ద గోల్డెన్ థ్రెషోల్డ్, బ్రోకెన్ వింగ్స్, భారతదేశం బహుమతి వంటి గ్రంథాలు ఆమెను నైటింగేల్ ఆఫ్ ఇండియాగా పిలవడానికి కారణమైనట్లు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు బాలకొండ గంగాధర్, గ్రంథాలయ శాఖ అధికారి మాధవరావు, కేశమ్మ, రేష్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

## అల్లాడుపల్లె దేవస్థానం ఇఒగా శ్రీనివాసులు

**ప్రజాశక్తి - చాపాడు**

మండలంలోని అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి దేవస్థానం ఇఒగా కె.శ్రీనివాసులు నియమితుల య్యారు. ఆ మేరకు దేవాదాయ ధర్మాదాయశాఖ కమిషనర్ కె.రామచంద్ర మోహన్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లె గంగమ్మ దేవస్థానం ఇఒగా పనిచేస్తున్న శ్రీనివాసులు ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇక్కడ పని చేస్తున్న ఎం.మారుతి ప్రసాద్ అనారోగ్య కారణంతో సెలవుపై వెళ్లారు. మహాశివరాత్రి ఉత్సవాల నిమిత్తం ప్రత్యేకంగా కె.శ్రీనివాసులును నియమించారు.

## క్యాంటీన్‌లో ఎంఆర్‌పికే విక్రయించాలి

**- సినిమా థియేటర్ల యజమానుల సమావేశంలో తహశీల్దార్**

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)**

సినిమా థియేటర్ క్యాంటీన్‌లలో ఎంఆర్‌పి ధరలకే విక్రయాలు చేయాలని తహశీల్దార్ గంగయ్య సూచించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం తన కార్యాలయంలో తహశీల్దార్ పట్టణంలోని సినిమా హాళ్ల యాజమనులతో సమావేశం నిర్వహించారు. కొత్త సినిమాలు విడుదల సమయంలో టిక్కెట్లు అమ్మే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సినిమా హాల్ క్యాంటీన్‌లో విక్రయించే వస్తువులు ప్రభుత్వం వారు నిర్దేశించిన ధరలకు మాత్రమే విక్రయించాలని వివరించారు. వీటిపై ఏవైనా ఫిర్యాదులు వస్తే ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు సినీ యాజమాన్యంపై తగు చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

## పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లాలి

**- ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ కుమారస్వామి గుప్తా**

**ప్రజాశక్తి - వేంపల్లె**

విద్యార్థి దశ నుండే పట్టుదల, ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్లి అనుకున్న లక్ష్యాన్ని అధిరోహించాలని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటి డైరెక్టర్ ఎవిఎస్ కుమారస్వామి గుప్తా సూచించారు. గురువారం ట్రిపుల్‌ఐటిని కడప పిఎం కేంద్రీయ విద్యాలయ ఉపాధ్యాయులు, విద్యార్థులు సందర్శించారు. ముందుగా వీరికి డైరెక్టర్‌తోపాటు పరిపాలనాధికారి రవికుమార్, అకాడమిక్ డీన్ రమేష్ స్వాగతం పలికారు. చిన్న వయసులోనే చదవు పట్ల శ్రద్ధ చూపడం, పెద్దపెద్ద కళాశాలల్లో స్థానం సంపాదించుకునే విషయాలపై మెలకువలు నేర్పించారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ ఉపాధ్యాయులు సత్యప్రసాద్, రాజేశ్వరి, నూర్జహాన్, కస్తూరి, ప్రతిమ, చంద్రిక, శ్రీలత, రమేష్, గంగరాజు, ఫయాజ్ పాల్గొన్నారు.

## అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తప్పవని పులివెందుల డివిజనల్ డెవలప్మెంట్ అధికారి (డిఎల్‌డిఒ) శ్రీనివాస్‌రెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రమైన సింహాద్రిపురం సచివాలయం1,2ను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎల్‌డిఒ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ నిర్ణీత గడువులోపు సర్వే నివేదికలను పంపించాలన్నారు. ఈనెల 15లోపు సర్వే నివేదికలను పూర్తిస్థాయిలో పంపించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కృష్ణమూర్తి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**IN THE COURT OF THE MOBILE COURT CUM IV ADDL JUNIOR CIVIL JUDGE :: KADAPA**

**O.S.No: 862/2020**

Oriental Bank of Commerce, Kadapa Rep. by its Branch Manager, now it is called as Punjab National Bank. **...Plaintiff**

**Vs**

1. B. Mohammed Hussain, S/o. Razak Miah.B @ B.Abdul Razack, 2. B. Mohammed Nazhar, S/o. Razak Miah.B @ B.Abdul Razack, Both are residing at D.No:42/567, N.G.O. Colony, Kadapa-516002.

**...Defendants**

**NOTICE TO DEFENDANTS**

Take notice that the plaintiff has instituted a suit against you for recovery of Rs. 2,08,527/- you are hereby summoned to appear in the Court in person or by a pleader duly instructed and able to answer all material questions on 24-02-2025 at 10-30 AM in the forenoon without fail, otherwise the matter will be decided against you as per law.

**//By Order of the Court//**

**A.RAVINDRANATH**
**Advocate for Plaintiff**
**Kadapa, A.P.**

**మహారాజశ్రీ ప్రొద్దుటూరు రెండవ అదనపు జిల్లా జడ్జి కోర్టు**

**I.A.No. 1078/2023**
**A.S.No. 36/2017**

సుల్తాన్‌సాబ్ గారి హుసేన్‌బీ, W/o హుసేన్‌సాబ్,52 సం॥, డోర్‌నెం.2/174, పెద్దశెట్టిపల్లె, ప్రొద్దుటూరు మండలం & వగైరా. **...పిటిషనర్స్/అప్పిలెంట్స్**

**Vs**

6. కడియం సుధాకర్, S/o పెద్ద సుబ్బరాయుడు, హిందూ, 27సం॥, బేల్దారి, డోర్‌నెం.2/173, పెద్దశెట్టిపల్లె, ప్రొద్దుటూరు మండలం & వగైరా. **...రెస్పాండెంట్స్/రెస్పాండెంట్స్**

**నోటీసు**

పై నెంబరు పిటిషన్‌ను R1 అయిన కడియం పెద్ద సుబ్బరాయుడు గతించినందున ఆయన వారసులుగా R5. కె.పద్మావతి, R6. కె.సుధాకర్, R7 కె.సునిత, R8 కె.సమలత లను చేర్చకోరుచూ దాఖలు చేసి వున్నాడు. అట్టి పిటిషన్‌పై నీకు ఏవైనా ఆక్షేపణలు వున్న యెడల 28.2.2025వ తేదీన ఉ.10.30 ని॥లకు స్వయంగా కానీ, లాయరు గారి ద్వారా కానీ హాజరై తెలుపుకొనవలెను. లేనిచో నీ పరోక్షమున ఎక్స్ పార్టీగా తీర్మానించబడును.

**వాయిదా తేది: 28.2.2025**

**//By Order of the Court//**

**ఎన్.వి.వరప్రసాద్**
**అడ్వకేట్, ప్రొద్దుటూరు.**

**మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు**

**I.A.No. 776/2023**
**A.S.No. 531/2020**

ఇడమడక రామాంజనేయులు, S/o రామయ్య, హిందూ 52 సం॥, డోర్‌నెం.8/573, గిడ్డంగివీది, ప్రొద్దుటూరు. **...పిటిషనర్/వాది**

**Vs**

యెన్నం విజయలక్ష్మి, W/o రామమోహన్‌రెడ్డి, 45 సం॥లు, వ్యాపారం, కొర్రపాడు గ్రామం, రాజుపాళెం మం॥, ప్రస్తుతం ఫ్లాన్‌నెం.201, రాఘవేంద్ర టవర్స్, ఎపిహెచ్‌బి కాలని, ప్రొద్దుటూరు. **...రెస్పాండెంట్/ప్రతివాది**

**నోటీసు**

పై నెంబరు పిటిషన్‌ను పిటిషనర్స్/వాది పిటిషన్ షెడ్యూలు దాఖల ఆస్తులను తీర్పునకు ముందు హాల్‌జప్తి చేయలాగున రెస్పాండెంట్/ప్రతివాది అయిన నీ పైన దాఖలు చేసి వున్నాడు. అట్టి పిటిషన్‌పై నీకు ఏమైనా ఆక్షేపణలు వున్న యెడల పై కోర్టు యందు 6.3.2025వ తేదీన ఉ॥ 10.30 ని॥లకు స్వయంగా కానీ, లాయరు గారి ద్వారా కానీ హాజరై తెలుపుకొనవలెను.లేనిచో నీ పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును అని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

**వాయిదా తేది: 06.03.2025**

**//By Order of the Court//**

**ఎన్.వి.వరప్రసాద్**
**అడ్వకేట్, ప్రొద్దుటూరు.**

**IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE, PRODDATUR**

**I.P.No. 52/2015**

Kamchamreddy Rama Mohan Reddy, S/o Jayarami Reddy, Aged 51 years, Hindu, Cooli, R/o D.No.3/85, Pandillapalli (V), Kamalapuram (M), Kadapa Dist. **...Petitioner**

**Vs**

40. Ankireddy Jainthamma, W/o Late Komma Soma Linga Reddy, Aged 63 years, House wife
41. Komma Veena, D/o Late K.Soma Linga Reddy, aged 35 years,
Both are R/o D.No.59/226-2-4, Akkayapalli, Nabikota, Kadapa Town & Dist.

**...Respondents No.40 & 41**

**నోటీసు**

ఈ నెంబరు I.P.లో 40, 41 రెస్పాండెంట్స్ అయిన మీరు రాజశ్రీ కోర్టు వారి నోటీసులు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమేమనగా, మీరు హాజరు అగుటకు గాను 24.12. 2025వ తేదీన పై కోర్టు నందు వాయిదా ఉంటూ ఉన్నది. పై కోర్టు నందు ఉదయం 10.30 గం॥లకు మీరు పైన తెలిపిన కోర్టు నందు హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల మీరు గానీ, మీ వకీలు ద్వారా గాని తెలుపుకొనవలెను. లేనంతట మిమ్మల్ని ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

**వాయిదా తేది: 24.2.2025**

**//By Order of the Court//**

**B.C.MADAIAH, L.L.M.,**
**Advocate, Proddatur.**